నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
శుక్రవారం | 01 మార్చి 2024 | www.navatelangana.com

వరి పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి మల్లేశం



నవతెలంగాణ-మిరుదొడ్డి
కాండం తొలిచే పురుగు అధికంగా ఉండడం వల్ల రైతులు వేసిన వరి పంటకు అధికంగా నష్టం కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి మల్లేశం అన్నారు. గురువారం ఆయన వరి పంట పొలాలను పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు అధికంగా ఉండడం వలన రైతులు చేయవలసిన యాజమాన్య పద్ధతులను అవలంబించాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వరిలో గంధక ప్రభావం వలన వేర్లు కుళ్ళి వాసన రావడం జరుగుతుందన్నారు . దాని నివారణకు హెక్సా కొనాజోల్ లేదా కాపర్ ఆక్సి క్లోరైడ్ మందులను వాడాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఓ కుమారుడి వివాహానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్ : హుస్నాబాద్ మండల పరిషత్‌లో విధులు నిర్వహిస్తున్న ఎంపీఓ సత్యనారాయణ కుమారుని వివాహం గురువారం కరీంనగర్‌లోని రాజ్యశ్రీ గార్డెన్‌లో జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ లకావత్ మానస సుభాష్, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, పందిలా ఎంపిటిసి జయలక్ష్మి, జిల్లెలగడ్డ మాజీ సర్పంచ్ లవుడ్యా స్వరూప హాజరై నూతన వధూవరులు సాయిరామ్ శ్రద్ధలను ఆశీర్వదించారు.

పంతులు కొలువులు...
1172

- ఎస్‌జీటీలు 708 స్కూల్ అసిస్టెంట్లు 261
- భాషా పండిట్లు 78, పీఈటీలు 15
- స్పెషల్ కేటగిరి ఎస్ఏలు 26, ఎస్‌జీటీలు 84 పోస్టులు
- పాత పోస్టుల్ని కలిపి తాజా నోటిఫికేషన్
- 4 నుంచి ఏప్రిల్ 3 వరకు దరఖాస్తుల స్వీకరణ
- పాత వాళ్లు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన పనిలేదు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి
ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ అభ్యర్థుల ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో పంతుళ్ల కొలువుల కోసం అభ్యర్థులు డీఎస్సీ ప్రిపరేషన్‌కు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1172 ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయి. గత ప్రభుత్వం ప్రకటించిన పోస్టుల్ని కలిపి అదనపు పోస్టులతో తాజా నోటిఫికేషన్ జారీ కావడంతో నిరుద్యోగుల్లో డీఎస్సీ ఆడావుడి మొదలైంది. ప్రభుత్వం ప్రకటించిన ఖాళీల్లో స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండిట్లు, పీఈటీలు, సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులతో పాటు స్పెషల్ కేటగిరిలో ఎస్ఎ, ఎస్‌జీటీ పోస్టులు కూడా ఉన్నాయి. ఈ నెల 4 నుంచి ఏప్రిల్ 3 వరకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తుల్ని స్వీకిరంచనున్నారు. 2023లో జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు తిరిగి దరఖాస్తు చేయాల్సిన అవసరంలేదు. డీఎస్సీ పరీక్షా తేదీలను ప్రభుత్వం త్వరలోనే ప్రకటించనుంది. దీంతో డీఎస్సీ అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీకి సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో 1172 పోస్టులు

ప్రభుత్వ పాఠశాల్లో ఉన్న ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 11062 పోస్టుల్ని ప్రకటించగా ఉమ్మడి మెదక్ జిల్లాలో 1172 పోస్టులున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 261 స్కూల్ అసిస్టెంట్, 708 ఎస్‌జీటీ పోస్టులున్నాయి. అదే విధంగా 78 భాషా పండిట్లు, 15 పీఈటీ పోస్టులతో పాటు 26 స్పెషల్ కేటగిరి స్కూల్ అసిస్టెంట్లు, 84 స్పెషల్ కేటగిరి ఎస్‌జీటీ పోస్టులున్నాయి. మూడు జిల్లా వారిగా పరిశీలిస్తే... సంగారెడ్డి జిల్లాలో 92 స్కూల్ అసిస్టెంట్లు, 24 భాషా పండిట్లు, 6 పీఈటీ, 385 సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులతో పాటు 9 స్పెషల్ కేటగిరి ఎస్ఎలు, 35 స్పెషల్ కేటగిరి ఎస్‌జీటీ పోస్టులున్నాయి. సంగారెడ్డి జిల్లాలో అన్ని రకాల పోస్టులు కలిపి 551 ఖాళీలు భర్తీ కానున్నాయి. సిద్దిపేట జిల్లాలో 77 స్కూల్ అసిస్టెంట్లు, 24 భాషా పండిట్లు, 8 పీఈటీ, 167 ఎస్‌జీటీ పోస్టులతో పాటు 8 స్పెషల్ కేటగిరి ఎస్ఎలు, 27 స్పెషల్ కేటగిరి ఎస్‌జీటీ పోస్టులున్నాయి. జిల్లా వ్యాప్తంగా 311 పోస్టులు భర్తీ కానున్నాయి. మెదక్ జిల్లాలో 92 ఎస్ఎలు, 30 భాషా పండిట్లు, ఒక పీఈటీ, 156 ఎస్‌జీటీ పోస్టులతో పాటు 9 స్పెషల్ కేటగిరి ఎస్ఎలు, 22 స్పెషల్ కేటగిరి ఎస్‌జీటీ పోస్టులు కలిపి జిల్లా వ్యాప్తంగా 310 పోస్టులు భర్తీ కానున్నాయి.

ఏప్రిల్ 3 వరకు దరఖాస్తుల స్వీకరణ

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 4 నుంచి ఏప్రిల్ 3 వరకు డీఎస్సీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తుల్ని స్వీకరించనున్నారు. 2023లో గత ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరంలేదని ప్రకటించారు. అభ్యర్థులు గతం మాదిరే వెయ్యి రూపాయల ఫీజు చెల్లించాలి. టెట్

జిల్లా	ఎస్ఏ	పండిట్	పీఈటీ	ఎస్‌జీటీ	మొత్తం	ఎస్ఏ	ఎస్‌జీటీ	టోటల్
సంగారెడ్డి	92	24	6	385	507	9	35	551
సిద్దిపేట	77	24	8	167	276	8	27	311
మెదక్	92	30	1	156	279	9	22	310
మొత్తం	261	78	15	708	1062	26	84	1172

అర్హత కల్గి 18 నుంచి 46 ఏళ్ల వయసు కల్గిన అభ్యర్థులందరూ 2024 డీఎస్సీ పరీక్షకు అర్హులవుతారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 పరీక్షా కేంద్రాలను ప్రకటించనున్నందున సంగారెడ్డిలో ఒక సెంటర్ ఉండే అవకాశముంది.

పుస్తకాలతో కుస్తీ

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో నిరుద్యోగ అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష కోసం పుస్తకాలతో కుస్తీకి దిగారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందే నోటిఫికేషన్ ప్రకటించడంతో అభ్యర్థులంతా డీఎస్సీ కోసం ప్రిపేర్ అయ్యారు. అంతలోనే ఎన్నికలు రావడంతో చదువుల్ని కాస్త పక్కన పెట్టారు. తిరిగి రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం గురువారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడంతో అర్హులైన అభ్యర్థులు డీఎస్సీకి సిద్ధమవుతున్నారు. పరీక్షా తేదీలు ప్రకటించనప్పటికీ పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఉండే అవకాశముందంటున్నారు. దీంతో నిరుద్యోగ అభ్యర్థులు కోచింగ్ సెంటర్లలో చేరుతున్నారు. పల్లెల్ని వదిలి పట్టణాలకు వెళ్తున్నారు. సంగారెడ్డి, సిద్దిపేటతో పాటు హైదరాబాద్‌లోని పలు రీడింగ్ సెంటర్లతో పాటు కోచింగ్ సెంటర్లలో నిరుద్యోగ అభ్యర్థులు నిండిపోతున్నారు.

ఉచిత కోచింగ్ సెంటర్లు నడపాలి: అనిల్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

డీఎస్సీ పరీక్ష కోసం నిరుద్యోగ అభ్యర్థులు ప్రిపరేషన్ అయ్యేందుకు వీలుగా ప్రభుత్వం వెంటనే ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రారంభించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరు బాలరాజు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేయాలన్నారు. ప్రయివేట్ కోచింగ్ సెంటర్లు అధిక ఫీజులు వసూలు చేయడం వల్ల పేద నిరుద్యోగ అభ్యర్థులు చదువుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. వాటిపై నియంత్రణ పెట్టి ఫీజుల భారం పడకుండా చూడాలన్నారు. డీఎస్సీ నిర్వహణలో ఏలాంటి అవకతవకలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కేటగిరిల్లోని పోస్టుల భర్తీల్లో మెరిట్, రిజర్వేషన్లను ఖచ్చితంగా పాటించాలన్నారు.



మంత్రి కూతురు పెళ్లికి హాజరైన గవర్నర్, సీఎం



నవతెలంగాణ- జోగిపేట
రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కూతురు త్రిష, మణికంఠల వివాహానికి రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన వివాహానికి హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఆయా పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు, అందోల్ నియోజకవర్గం తో పాటు ఆయా నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నవతెలంగాణ-జహీరాబాద్



మంత్రి దామోదర రాజనర్సింహ కూతురు త్రిష వివాహానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోనింటి మాణిక్యరావు, చింత ప్రభాకర్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ హాజరై నూతన వధువరుల్ని ఆశీర్వదించారు. గురువారం హైదరాబాద్‌లోని ఓ పంక్షన్ హాల్‌లో త్రిష వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. వేడుకలకు హాజరైన పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు మంత్రి దామోదర రాజనర్సింహ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్ఎంసీ ప్లాంట్‌ను తొలగించాలని వినతి

నవతెలంగాణ-రామచంద్రాపురం



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మై హెూం వెంచర్స్, శిల్ప వెంచర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆర్ఎంసీ ప్లాంట్‌ను తొలగించాలని గురువారం పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి మున్సిపాలిటీ కమిషనర్ సంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ జనావాసాలు అధికంగా ఉన్న తెల్లాపూర్ ప్రాంతంలో ఆర్ఎంసీ ఏర్పాటును విరమించుకోవాలన్నారు. ఆర్ఎంసీ ప్లాంట్ ఏర్పడితే దుమ్ము, దూళి, వాతావరణం కాలుష్యం వల్ల స్థానిక ప్రజల జీవనానికి తీవ్ర ఇబ్బందులు కలుగుతాయన్నారు. ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజల్ని కలుషిత వాతావరణంతో నెట్టి వారి ఆరోగ్యాలతో ఆడుకోవడం మానుకోవాలన్నారు. అధికారులు స్పందించి వెంటనే ఆర్ఎంసీ ప్లాంట్ ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం: డిఈ లక్ష్మీనారాయణ

నవతెలంగాణ- జహీరాబాద్
జహీరాబాద్ 132/33 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగ శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు సబ్ స్టేషన్లలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ డీఈ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఝరాసంఘం ఫీడర్ ఫెయిల్ అయిన కారణంగా దాన్ని మార్చడానికి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుండి 4.30 గంటల వరకు డివిజన్ పరిధిలోని రంజోల్, పస్తాపూర్, అల్గోల్, దిగ్వాల్, వెంకటాపూర్, సజ్జాపూర్, మాచనూర్, జరా సంఘం, ఎల్గోయి, జీర్లపల్లి, చీలపల్లి, రాయికోడ్, కర్చల్, మహబద్పూర్, సింగీతం, న్యాల్కల్, హద్నూర్, డప్పురు, చాల్కి ,మెటల్ కుంట, మామిడిగీ, మీర్జాపూర్, సత్వార్, ధనసిరి , బూచినెల్లి, చిన్న హైదరాబాద్, మల్చల్మ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని డి ఈ లక్ష్మీనారాయణ కోరారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-మిరు దొడ్డి



ప్రమాదవశాత్తు కాలు జారి కూడవెల్లి వాగులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అక్బర్పేట భూంపల్లి మండలం రుద్రారంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సిద్ధం నరసయ్య (53) ప్రతిరోజు కూలి పనులు చేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరిగానే మేస్త్రీ పనికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపో యాడు. కుటుంబ యజ మాని మృతి చెందడంతో కుటుంబీకులు అనాథలుగా మారారు. ఈ మేరకు ఎస్సై పరశు రాములు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమ కళాకారునికి యువ పురస్కారం అవార్డు



నవతెలంగాణ-మిరుదొడ్డి: తెలంగాణ డప్పు ఉద్యమ కళాకారుడు అందె భాస్కర్‌కు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం వరించింది. ఢిల్లీ సంగీత నాటక అకాడమీ నుంచి ఈ మేరకు అందె భాస్కర్ పేరును ప్రకటించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన అందె (అంగడి) భాస్కర్ డప్పు వాయిద్య నేపథ్యాన్ని ఖండాంతరా లు దాటిన నేపథ్యంలో యువ పురస్కారం అందడం ఎంతో గర్వకారణం. ఈ మేరకు ఢిల్లీలో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం అందుకోనున్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా డప్పుకు అరుదైన గౌరవం లభించడం పట్ల కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అందే భాస్కర్ మాట్లాడుతూ పల్లెల్లో మారుమోగే డప్పు దరువును ప్రపంచవ్యాప్తంగా వినిపించడం చాలా గర్వంగా ఉందన్నారు. డప్పు దరువులో అంతర్జాతీయ కళాకారుడు సూర్య భగవాంతరావు వద్ద ఓనమాలు నేర్చుకోవడం జరిగిందన్నారు. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ సూచనల మేరకు తెలంగాణలో సుమారు 3000 మందికి డప్పు శిక్షణను అందించడం జరిగిందన్నారు. తన వద్ద శిక్షణ పొందిన పురుషులే కాకుండా మహిళలు సైతం డప్పు వాయిద్యంలో ప్రావీణ్యం సాధించి జాతీయస్థాయిలో ప్రదర్శనలు ఇచ్చారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ పురస్కారం లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అవార్డు రావడం తనపై మరింత బాధ్యత పెరిగిందని భవిష్యత్తులో డప్పు దరువును తెలియజేసేలా కళాకారులను తయారు చేస్తానన్నారు. అవార్డు ప్రకటించిన జూరీ సభ్యులకు కేంద్ర సంగీత నాటక అకాడమీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

మార్కెట్ కమిటీ రిజర్వేషన్లు ఖరారు

నవ తెలంగాణ- మిరుదొడ్డి: సిద్దిపేట జిల్లాలోని 14 మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. సిద్దిపేట ఓసి మహిళ, చిన్నకోడూరు ఓసి, వంటిమామిడి ఎస్సీ మహిళ, గజ్వేల్ ఓసి, హుస్నాబాద్ ఓసి, నంగునూరు ఓసి, తొగుట ఓసి, దౌల్తాబాద్ ఓసి, మిరుదొడ్డి ఓసీ మహిళా, బెజ్జంకి ఓసి, కోహెడ ఎస్సీ, చేర్యాల బీసీ మహిళ, దుబ్బాక ఓసి, కొండపాక ఓసి ఇలా మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి.

రాజీ మార్గమే రాజ మార్గం

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని



నవతెలంగాణ-అక్కన్నపేట
రాజీ మార్గమే రాజామార్గమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. మండలంలోని కట్కూరు గ్రామంలో ఎంపీడీఓ జయరాం ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి వి.శివరంజని హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఆడ, మగ అనే తేడా లేకుండా పెంచాలన్నారు. చట్టాల గురించి అందరికి చేరవేయాలనే లక్ష్యాలకు అనుగుణంగా న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో ఇరు వర్గాలకు భూమి, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే రాజీమార్గం ద్వారా పరిష్కారం చేసుకోవాలని తెలియజేశారు. దీనికోసం ప్రతి కోర్టులో న్యాయ సేవా సదస్సు ఉంటుందని, ఈ సదస్సులో ఇరు వర్గాలకు కోర్టు లాయర్లను నియామకం చేస్తుందన్నారు. దీని ద్వారా ఇరు వర్గాలు న్యాయాన్ని పొంది రాజీ చేసుకోవాలన్నారు. గ్రామాల్లో లైంగిక దాడులు, హత్యలకు పాల్పడరాదని, అలాంటి వాటిని ప్రేరేపిస్తే కఠిన చర్యలు ఉంటాయని శివరంజని తెలియజేశారు. పిల్లలను బాగా చదివించాలని దాని ద్వారానే వారికి జ్ఞానం పెరుగుతుందని తెలియజేశారు. జూలై ఒకటో తేదీ నుంచి నూతన చట్టాలు అమల్లోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జయరాం, ఎస్ఐ తాండ్ర వివేక్, పంచాయతీ కార్యదర్శి మోహన్ నాయక్, ఎంపీటీసీ సుధేష్ణ, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలి

- ఎస్ఎస్ఎఫ్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్
విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ నాయకుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. గురువారం కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు హుస్నాబాద్ ఎస్సై తోట మహేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో వ్యక్తిత్వ వికాసం- మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన నరేష్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇప్పటికీ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు నమ్మడం దురదృష్టకరమన్నారు. విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడుతూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని, దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా మోసం చేస్తున్నారన్నారు. దయ్యాలు భూతాలు మంత్రాలు బూటకమన్నారు. విద్యార్థి దశలోనే ఉన్నత చదువులతో తల్లిదండ్రుల లక్ష్యాలను నెరవేర్చాలని విద్యార్థులకు వివరించారు. సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించిన నరేష్ ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతిపై కిరోసిన్‌తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం, పేపర్లు కాల్చి చాక్లెట్లు చేయడం, విద్యార్థి వాచిని మాయం చేసి రింగు తీసి ఇవ్వడం లాంటి అనేక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మనెమ్మ, ప్రిన్సిపల్ మమత , పోలీస్ సిబ్బంది అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు



నవతెలంగాణ-సంగారెడ్డి
ఆటో కార్మికులను ప్రభుత్వ ఆదుకోవాలి, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఎ జిల్లా కార్యదర్శి జి. సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ట్రాన్స్‌పోర్ట్ రంగం యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రవాణా రంగ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. సామాజిక భద్రత పథకాలు లేవన్నారు., అనారోగ్యం పాలై ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మికులకు ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా ప్రమాద బీమా ఆరోగ్య భీమా, పిల్లల చదువులు, పెండ్లికి ఆర్థిక సహాయం అందించేలా సంక్షేమ బోర్డుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కేరళలో అమలు చేస్తున్న సంక్షేమ బోర్డు విధానాలను పరిశీలించి తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు తగ్గించేందుకు మోటర్ వాహన చట్టాన్ని సవరణలు చేస్తామన్న పేరుతో కేంద్ర ప్రభుత్వం ఎం, వి యాక్ట్-2019ని తీసుకొచ్చిందన్నారు. చిన్న చిన్న పొరపాట్లకే వేలాది రూపాయలు జరిమానులు వేస్తూ డ్రైవర్లకు జైలు శిక్షలు అమలు చేస్తున్నారన్నారు. ఆటో కార్మికులకు జీవించే పరిస్థితి లేకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాల స్క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం పెంపుదల టోల్ చార్జీల పెంపు వంటివి చట్టం ద్వారా అమలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చట్టంలో మార్పులు చేయాలని అనేక పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ఒత్తిడి తీసుకురావడంలేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వమైనా ఎం,వి యాక్ట్ 2019లో సవరణలు చేయాలన్నారు. భారతీయ న్యాయ సంహిత 106(1)(2)ను రద్దు చేయాలి, ఈ బస్ స్కీం వలన నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోతే రానున్న రోజుల్లో రవాణా రంగ కార్మికులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు బాబురావు, రవాణా రంగ యూనియన్ నాయకులు శేఖర్, మాణిక్యం, ప్రవీణ్, ప్రభు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి పర్యటనకు పటిష్టమైన భద్రత

- జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి
ఈనెల 5న ప్రధాన మంత్రి మోడీ పర్యటించనున్నందున పటిష్టమైన భద్రత కల్పించాలని అందుకవసరమైన చర్యలు తీకుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం ఆమె జిల్లా ఎస్పీ రూపేష్ తో కలిసి ఐఐటి కందిలో ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్ర మోడీ పర్యటన ఉన్నందున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖకు వివరించారు. యస్‌పిజీ ఆదేశాలను అధికారులు కచ్చితంగా పాటించాలన్నారు. రోడ్డు భద్రత ఏర్పాట్లు చేయాలని,బారికేడ్లను ఏర్పాట్లను చేయాలని, రోడ్ల భవనల శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఆక్సిజన్ సిలిండర్లు వైద్య సహాయం కోసం ఆరోగ్యశాఖను సూచించారు. ప్రోటోకాల్ సమస్య రాకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు. విధులు నిర్వహించే అధికారులకు, మీడియా ప్రతినిధులకు , ప్రజా ప్రతినిధులకు, పాస్ లు జారీ చేయాలన్నారు .ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు చంద్రశేఖర్ , మాధురి, అదనపు ఎస్పి సంజీవ్ రావు, ఎలక్ట్రిసిటీ ఎస్ ఈ మాధవరెడ్డి, అర్ టి ఓ శివలింగం, డి పిఓ సాయిబాబా పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటి నరసింహ





నవతెలంగాణ- జహీరాబాద్
అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్య వర్గ సభ్యులు ఈటీ నరసింహ అన్నారు. గురువారం పట్టణంలోని ఈద్గా ఎడ్ల బజార్ నుండి ఆర్డిఓ కార్యాలయం వరకు ప్రజా నాట్యమండలి కళాకారుల ఆట పాటలు ఎర్రజెండాలతో జహీరాబాద్ ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం సీనియర్ అసిస్టెంట్ సుభాష్ రెడ్డికి వినతి పత్రంతో పాటు 2500 దరఖాస్తులు అందజేశారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అర్హులందరికీ డబుల్ బెడ్రూమ్ ఇస్తామని ఆశచూపి నామమాత్రంగా కొందరికి మాత్రమే ఇచ్చి అర్హులైన పేదలందలను విస్మరించిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైనవారికి ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే సంబంధిత మంత్రులకు ప్రభుత్వానికి అర్హులైన వారి జాబితాను దరఖాస్తులను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్, జిల్లా నాయకులు అజారుద్దీన్, ఆనంద్, మహబూబ్ ఖాన్, అశోక్, రుబీనా బేగం, చిరంజీవి, సయ్యద్ తాజుద్దీన్, నర్సింలు, ఖాజా సయ్యద్, లతీఫ్, ఆసిన్, అజీజ్, రాజు, శంకర్, షహీన్ బేగం, మధుమాల, లక్ష్మి పాల్గొన్నారు.

నవజాత శిశువుల స్క్రీనింగ్ కార్యక్రమం



నవతెలంగాణ-సంగారెడ్డి
చిన్నారులకు రాబోయే ఆరోగ్య సమస్యలను కొన్నింటిని ముందుగానే గుర్తించి చికిత్స చేస్తే అటువంటి రుగ్మతలను నయం చేసే అవకాశముందని జిల్లా ఇంచార్జీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇబ్రహీం అన్నారు. గురువారం నవజాత శిశువుల స్క్రీనింగ్ కార్యక్రమాన్ని స్థానిక సర్వజన ఆస్పత్రి మాతా శిశు ఆరోగ్య భవన సమావేశ మందిరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా పుట్టుకతో వచ్చే అనేక ఆరోగ్య సమస్యలతో భవిష్యత్తులో చిన్నారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్థిక సమస్యలతో కుటుంబం బాధ పడుతుందన్నారు. పుట్టుకతో వచ్చే కొన్ని ఆరోగ్య సమస్యలను బిడ్డ పుట్టిన 48 గంటల తర్వాత రక్త నమూనాలను సేకరించి పరీక్షకు పంపించి వ్యాధిని నిర్ధారించి చికిత్స ప్రారంభిస్తే రుగ్మతల నుండి బిడ్డను రక్షించవచ్చున్నారు రుగ్మతలపై ప్రయోగాత్మక పరిశీలనలో వచ్చిన ఫలితాలలో పుట్టుకతో వచ్చే హైపోథైరాయిడ్ 81 మంది పిల్లలు జన్మిస్తే అందులో ఒకరికి ఉండే అవకాశం ఉందన్నారు. అడ్రినల్ హైపోప్లాసియా 2009 మందిలో ఒకరికి +6 లోపం, 932 మందిలో ఒకరికి బయోటిన్‌డెడ్ లోపం, 1475 మందిలో ఒకరికి గలెక్టోసీమియా, 1340 మందిలో ఒకరికి ఉండే అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రంలో ఈ సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. సర్వజన ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ రక్త పరీక్షలు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పరీక్షలకు అయ్యే ఖర్చు ప్రైవేటు లలో దాదాపు పదివేల వరకు అయ్యే అవకాశం ఉందన్నారు. పరీక్షలను ప్రభుత్వ దావకానాల్లో ఉచితంగా చేస్తారన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన శిశువుకు చికిత్స కూడా ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శశాంక్ దేశ్పాండే, గైనకాలజిస్ట్ డాక్టర్ రాధిక, ఆర్ ఎం ఓ డాక్టర్ రామాంజనేయులు , వైద్య కళాశాల విద్యార్థులు నర్సింగ్ కళాశాల విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
శుక్రవారం | 01 మార్చి 2024 | www.navatelangana.com

జిన్నారంలో శివమహా పడిపూజ



నవతెలంగాణ- జిన్నారం

జిన్నారంలో స్థానిక తాంబేలు గుట్ట వద్ద నూతనంగా నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయ ప్రాంగణం వద్ద శివ స్వాముల బృందం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శివ మహా పడిపూజ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్ ముఖ్య అతిధులుగా వేరు వేరుగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు జిన్నారం వెంకటేశం గౌడ్, గడ్డపోతారం జనాభా భాయి, వివిధ పార్టీల నాయకులు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, జిన్నారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డేకృష్ణ, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ గౌడ్ యువనేత నరేష్, నాయకులు బ్రహ్మేంద్ర గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మంద రమేష్, మాజీ ఎంపిటిసి పొట్టి భాస్కర్ శివాలయం కమిటీ ప్రతినిధులు వడ్ల ఆనంద్ చారి,వివిధ పార్టీల నాయకులు యువకులు పాల్గొన్నారు.

గురుకుల జేఎల్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన మల్లేశం



నవతెలంగాణ-రాయికోడ్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ గురుకుల ఉద్యోగాలలో రాయికోడ్ గ్రామానికి చెందిన మొగలిగిదే మల్లేశం జూనియర్ లెక్చరర్ ఇంగ్లీష్ పోస్టుల్లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించారు. రాష్ట్ర స్థాయిలో 257 ఉద్యోగాలకు పరీక్ష నిర్వహించగా సుమారు 30 వేల మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. గురుకుల పీజీటీ ఇంగ్లీషు సబ్జెక్టులో కూడా ఉద్యోగం సాధించారు. ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించడం పట్ల వారి తల్లిదండ్రులు లక్ష్మయ్య, సత్యమ్మ కుటుంబ సభ్యులు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. మల్లేశం విద్యాభ్యాసం ఒకటి నుంచి 10వ తరగతి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయికోడ్‌లో కొనసాగింది. ఆ తర్వాత ఇంటర్మీడియట్, డిగ్రీ జహీరాబాద్ ప్రైవేట్ కళాశాలలో చదివారు. బీఎడ్ స్వామి నారాయణ గురుకుల్, చిలుకూరులో పీ.జీ. ఎం.ఏ. ఇంగ్లీష్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఈడి. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యా భ్యాసం చేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ పట్టుదలతో కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ప్రభుత్వ ఉద్యోగాలను సాధించవచ్చున్నారు. యువతకు మల్లేశం ప్రతిభ ఆదర్శంగా నిలుస్తుందని పలువురు ఆయన్ను అభినందించారు.

అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్లకు తాళాలు



నవతెలంగాణ - రామచంద్రాపురం

రామచంద్రాపురం జీహెచ్ఎంసీ పరిధిలోని జాతీయ రహదారి పక్కన అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్లకు గురువారం ఐలా అధికారులు తాళాలు వేసారు. పటాన్ చెరు స్టీల్ కంపెనీ పేరు మీద ఉన్న ల్యాండ్‌లో అనుమతులు లేకుండా మార్బుల్స్ టైల్స్, హర్ష టయోటా షోరూం షెడ్లను నిర్మించారు. విషయం తెలుసుకున్న ఐలా అధికారులు అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్లకు తాళాలు వేసి సీజ్ చేశారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



నవతెలంగాణ-కల్హేర్

కల్హేర్ మండలం లోని మార్డి గ్రామానికి చెందిన భద్రయ్య కూతురు (రాణి) మానస వివాహం నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్లో గురువారం జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అమృత హాస్పిటల్ యజమాని సంగ్రామ్ రేణుకల వివాహ డిన్నర్ కార్యక్రమానికి హాజరై నూతన వధూవర్నులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగయ్య, నారాయణ, కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ, డాక్టర్ రాజు పాల్గొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి

భూ సమస్యలకు పరిష్కారానికి ప్రభుత్వ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ధరణి సమస్యలపై స్పెషల్ డ్రైవ్ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని జిల్లాలో ఉన్న దరఖాస్తులను మండల కార్యాలయాలకు పంపించడం జరుగుతుందని, రెవెన్యూ శాఖ ద్వారా మండల గ్రామస్థాయిలో పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 1 నుండి 9 వరకు సెలవు రోజుల మినహా మిగతా రోజుల్లో భూ సమస్యల పరిష్కారానికి పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని, అధికారులకు సహకరించి వారి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. గతంలో ఉన్న ధరణి అధికారాలు ప్రతి దరఖాస్తు కలెక్టర్ ద్వారా పరిష్కరించే విధంగా ఉండేవని, ఆర్డిఓ, ఎంఆర్‌ఓ స్థాయిలో ఉండేవి కావని ధరణిలో ప్రభుత్వం కొత్త నిబంధనలు సవరించడం జరిగిందని చెప్పారు. దీని ప్రకారం కొన్ని అధికారాలు రెవిన్యూ డివిజనల్ అధికారి వారికి, కొన్ని అధికారాలు తహశీల్దార్ పరిధిలో పరిష్కారం అయ్యే విధంగా కొత్త నిబంధనలు వచ్చాయని చెప్పారు. తహశీల్దార్ స్థాయిలో ఉన్న అధికారాలను వివరిస్తూ పట్టాదారు చనిపోతే వారసులకు బదలాయించే అధికారాలు, పట్టాదారు పేరు సరి చేయడం ఆధార్ నెంబర్, స్త్రీ, పురుషులు పేరు తప్పులు మార్పు చేయడం అసైన్డ్ డేటా, డిజిటల్ సిగ్నేచర్, పాస్ బుక్ లో ఫోటో సరి చేయడం , తండ్రి పేరు భర్త పేరు తప్పులు దిద్దుట అన్ని అధికారాలు ఇప్పటినుంచి తహశీల్దార్ స్థాయిలో ఉన్నాయని చెప్పారు. నాలుగు రకాల అధికారులను జిల్లా స్థాయి నుండి తహశీల్దార్ కు బదలాయించినట్లు వివరించారు. కొత్తగా వచ్చిన సర్క్యులర్ ప్రకారం పాస్ బుక్ లేకుండా నాన్ అగ్రికల్చర్ కన్వర్షన్ క్రింద మార్పుటకు దరఖాస్తులు ఇంతకుముందు జిల్లా కలెక్టర్ స్థాయిలో ఉండేవని ఇప్పుడు ఆర్డీవో స్థాయికి మార్పులు చేశారని చెప్పారు. ప్రజావాణి రిలేటెడ్ ల్యాండ్ సమస్యలపై ఆర్డిఓ కి అధికారాలు ఉన్నాయని అలాగే ఎవరైనా ప్రవాస భారతీయులు పాస్ బుక్ కావాలంటే గతంలో వారి పాస్‌పోర్ట్ ఆధారంగా మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే కొత్తగా పాస్ బుక్ వచ్చేదని, అదేవిధంగా ఏదైనా కంపెనీ గాని ఇన్స్టిట్యూషన్ గాని పాస్ బుక్ రావాలంటే ఆ అధికారం కూడా కలదనిచెప్పారు. కోర్టు కేసులు సంబంధించి విషయాలపై భూమి ఇరువురి మధ్య తగాదాలు కోర్ట్ ఆర్డర్ ప్రకారం బ్లాక్ లిస్టులో పెట్టే అధికారాలు ఆర్డిఓకే కలవని చెప్పారు. టీఎం 33 అప్లికేషన్స్- 5 లక్షల విలువ ఉన్న భూముల వరకు ఆర్డీవో స్థాయిలో అధికారాలు ఉంటాయని ఐదు లక్షల నుంచి 50 లక్షల వరకు కలెక్టర్ పరిశీలన చేయవలసి ఉంటుందని అన్నారు. జిల్లాలో ఉన్న దరఖాస్తులన్నీ రెవిన్యూ స్థాయిలో మూడు బృందాలుగా ఏర్పడి కేటగిరి వారీగా విభజించి ఎంక్వైరీ, రికార్డుల పరిశీలన చేసి వాళ్ల స్థాయిలో పరిష్కరించే విధంగా ఉంటే వెంటనే పరిష్కరిస్తారని వారి స్థాయిలో లేని వాటిని కలెక్టర్ ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారాన్ని కృషి చేస్తారని చెప్పారు. ఈ ధరణి సమస్యల పరిష్కారానికి మూడు బృందాలలో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ ,రెవిన్యూ ఇన్స్పెక్టర్ స్థాయిలో ఈ బృందాలు 03 బృందాలు పనిచేస్తారని అన్నారు. సర్వేయర్, గిర్దావర్ పేరా, లీగల్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రెటరీ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్, వీళ్ళందరూ ఈ బృందాలతో ఉంటారని చెప్పారు. జిల్లాలో ఉన్న ప్రజలందరూ వారి భూ సమస్యల పరిష్కారానికి సువర్ణ అవకాశంగా భావించి అధికారులకు సహకరించి వారి భూ సమస్యలను సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ మాధురి, డి ఆర్ ఓ పద్మజా రాణి జిల్లా అధికారులు, ఆర్‌డిఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



చిన్న చిన్న చిట్కాలతో అధిక ఉత్పత్తి సాధ్యం

- కెవికె శాస్త్రవేత్త వరప్రసాద్



నవతెలంగాణ- జహీరాబాద్

చిన్న చిన్న చిట్కాలతో అధిక ఉత్పత్తి సాధ్యమని గ్రామీణ రైతులు, చిరుధాన్యాలను సాగు చేసే రైతులు నిరూపించారని కెవికె శాస్త్రవేత్త వరప్రసాద్ అన్నారు. గురువారం డి.డి.ఎస్ - కె.వి.కె ఆధ్వర్యంలో ఐసిఏఆర్ అటారి సహకారంతో చిరు ధాన్యాల సాగు, విలువ జోడింపు పదార్థాలపై నాలుగు రోజులు జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మట్టి నమూనా సేకరణ, మట్టి పరీక్ష, ఎరువుల తయారీ, కషాయాల తయారీ, చిరుధాన్యాలు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. వివిధ రకాల చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీ, వాటి ప్యాకింగ్, మార్కెటింగ్ గురించి తెలిపారు. కెవికెలో మహిళలకు ఉపాధి కల్పించే ఇతర శిక్షణ కార్యక్రమాలను పేర్కొన్నారు. పాల్గొన్న మహిళ రైతులు శిక్షణ కార్యక్రమంలో రైతులు అనుభవాలను తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు, పది మంది గ్రూపుగా తయారై శిక్షణలో నేర్పించిన విషయాలను తాము ఆచరిస్తామని తెలిపారు. అనంతరం కంగ్టి మండలం, సంగారెడ్డి జిల్లాకు చెందిన మహిళా రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవికే సిబ్బంది, శిక్షణ సీనియర్ రైతులు పాల్గొన్నారు.

మీ రక్షణకే మేమున్నాం:ఎస్పీ రూపేష్

నవతెలంగాణ-కొండాపూర్

ప్రజల రక్షణకే పోలీసులున్నారని జిల్లా ఎస్పీ రూపేష్ అన్నారు. గురువారం కొండాపూర్ పోలీస్ స్టేషన్‌లో ప్రజల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల చిన్నపిల్లలను ఎత్తుకెళ్లే బీహార్, ఇతర రాష్ట్రాల నుంచి గ్యాంగులు వచ్చాయని సోషల్ మీడియాలో షికార్లు పుకార్లు చేస్తున్నాయన్నారు. అలాంటి వ్యక్తులు ఎవరు జిల్లాలో ప్రవేశించలేదన్నారు. అసత్య ప్రచారాన్ని నమ్మకూడదన్నారు. గ్రామాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కన్పిస్తే వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. లేని పక్షంలో స్థానిక పోలీస్ స్టేషన్లోని ఎస్ఐ సహాయం తీసుకోవాలన్నారు. ఏ ఒక్కరు కూడా చట్టాలను చేతిలోకి తీసుకొని ఇతరుల మీదకి దాడికి దిగవద్దన్నారు. సంగారెడ్డిలో వివిధ రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తులు ఉపాధి రీత్యా జీవనం సాగిస్తున్నారన్నారు. ఊహ జనిత వేషధారణ కలిగిన వ్యక్తులను గుర్తించి దాడులకు దిగువద్దన్నారు. మంత్రాలు, మూఢనమ్మకాలు నమ్మవద్దన్నారు. స్వామీజీలు, బాబాల దగ్గరకు తిరిగి డబ్బులు ఖర్చు చేసుకోవద్దన్నారు. అనంతరం డీజీపీ సత్యయ్య మాట్లాడుతూ ఈ నెల 9న లోకాలదత్ కేసు నమోదు అయిన డ్రంక్ అండ్ డ్రైవ్, పెండింగ్ కేసులు కొట్టివేస్తారన్నారు. రహదారుల వెంట రాంగ్ రూట్లో ప్రయాణించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రయ్య, ఎస్ఐ హరి శంకర్ గౌడ్, పోలీసులు, ప్రజా ప్రతినిధులు, యువకులు ప్రజలు పాల్గొన్నారు.



ఘనంగా స్వయం పాలన దినోత్సవం



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నాగులగిద్ద మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించారు. స్వయం పాలనలో పాటలు, డాన్సులతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ కౌన్సిల్ సభ్యులు రమేష్ మాట్లాడుతూ కష్టపడి ఇష్టంతో చదవాలన్నారు. స్వయంకృషితో విద్యార్థులు ముందుకు పోవాలన్నారు. మంచి యూనివర్సిటీలలో చదువుకోవాలనే లక్ష్యాలను సాధించేందుకు కష్టపడి చదవాలని పిలుపు నిచ్చారు. స్వయం పాలనలో డీఈఓగా శృతి, ఎమ్ఈఓగా ప్రదీప్, హెచ్ఎంగా చందు వ్యవహారించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సర్దార్, ఉపాధ్యాయులు భవాని, శ్వేత, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదేవి భూదేవి శ్రీ వేంకటేశ్వర స్వామి 17వ బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ- ఐడిఏబొల్లారం

బొల్లారంలోని శ్రీ భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి 17 వ బ్రహ్మోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం ఐదు గంటలకు మంగళవాయిద్యాలు, 11 గంటలకు అభిషేకం, సాయంత్రం ఏడు గంటలకు విశ్వక్షేన పూజ, గరుడబేరి, ధ్వజారోహణం వైభవంగా జరిగాయి. అనంతరం గోపి మహేష్ అగర్వాల్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పెద్ద ఎత్తున భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేస్తాం

- విద్య, వైద్యం ప్రజలకు అందుబాటులోకి తెస్తాం
- మాజీ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్



నవతెలంగాణ- నారాయణఖేడ్ రూరల్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేస్తామని, విద్య వైద్యం కోసం, రైతు సమస్యలు పరిష్కరించే విధంగా పార్లమెంట్లో కృషి చేస్తామని మాజీ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ అన్నారు. గురువారం తన నివాసంలో మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి పథకాన్ని కాంగ్రెస్ పార్టీ భూమిలేని కుటుంబాలకు చిన్న సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా తెచ్చిందన్నారు. ప్రజలకు కొనుగోలు శక్తిని పెంచే విధంగా కాంగ్రెస్ పార్టీ ఉపాధి హామీ చట్టం చేయడం జరిగిందనారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని బడ్జెట్లో నిధులు తక్కువ చేయడం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. 2019-20 సంవత్సరంలో రూ.71002 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. 2020-21 లో రూ.61500 కోట్లుకు పడిపోయిందంటే 13 శాతం నిధుల్ని కోత పెట్టిందన్నారు. వ్యవసాయ కూలీల కోసం నిధులు పెంచి పార్లమెంట్లో మన సమస్యల గురించి మాట్లాడుతానన్నారు. విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న ధర్నాకు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తుందన్నారు.

ధ్యానం జీవితంలో భాగం కావాలి

- వైయస్సార్ కాలనీలో ధ్యాన కేంద్రాన్ని ప్రారంభించిన కౌన్సిలర్ చంద్రారెడ్డి

నవతెలంగాణ- ఐడిఏబొల్లారం

ప్రతి వ్యక్తి తన జీవితంలో ధ్యానాన్ని భాగంగా చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అన్నారు. గురువారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వైయస్సార్ కాలనీలో ఏర్పాటు చేసిన ధ్యాన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు పోయి ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. జీవితంలో ఎదురయ్యే కష్ట సుఖాలు, లాభనష్టాలను సమానంగా స్వీకరించగలుగుతారన్నారు. మరణ భయాన్ని కూడా జయించగలరని తెలిపారు. ప్రతి ఒక్కరు దైనందిన జీవితంలో తప్పకుండా ధ్యానం చేయాలని కోరారు. ధ్యాన కేంద్రంలో ఉచితంగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్న దత్తు, పాండరి మాస్టర్లను అభినందించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వాహకులు కౌన్సిలర్ వి.చంద్రారెడ్డిని, కౌన్సిలర్లను స్థానిక నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రయ్య, నాయకులు చక్రపాణి, వెంకటయ్య లక్ష్మారెడ్డి, బాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీను, అశోక్, నర్సింహులు, దిగంబర్, వెంకటేష్, జగన్, రమేష్, అశోక్, నిర్వాహకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



సీఐని మర్యాద పూర్వకంగా కలిసిన జె.మోహన్ రాజ్



నవతెలంగాణ-కొండాపూర్

జే.మోహన్ రాజ్ అంబేద్కర్ సంఘం మండల అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్‌ను చంద్రయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాట్లాడుతూ దళిత, గిరిజన భూములను కాపాడి రక్షణ కల్పించాలని కోరారు. దళిత, గిరిజన మహిళలపై దాడులను, అత్యాచారాలను అరికట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పగడ్బందీగా అమలుపరచాలన్నారు. మైనర్ బాలికలపై జరుగుతున్న దాడులను, అత్యాచారులను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యానందం, నవీన్, అధికార ప్రతినిధి ప్రభుదాస్, మల్లెపల్లి సర్పంచ్ జగదీశ్వర్, నాగయ్య, రామచంద్రయ్య, పాండు, ఎస్సీ ఎస్టీ సెల్ మల్లేశం పాల్గొన్నారు.

బీజేపీకి మరొక్కసారి అవకాశం కల్పించాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



దేశంలో బిజెపిని మరొక్కసారి అవకాశం కల్పించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా విజయ సంకల్ప యాత్ర బిజెపి పార్టీ నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వచ్చే రాజు చౌక్ వద్ద ప్రసంగించారు బిజెపిని మరొకసారి అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ జొన్నవాడ సంగప్ప, సీనియర్ నాయకులు విజయ్ పాల్ రెడ్డి, రజినీకాంత్, సాయి రామ్, మాణిక్ బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు ఆవిష్కరణలకు మార్గాలు

నవతెలంగాణ- జిన్నారం

పరిశోధనలు నూతన ఆవిష్కరణలకు మార్గాలని ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ అన్నారు. జిన్నారంలోని ప్రతిభావిద్యానికేతన్ హైస్కూల్లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సృజన శీలతను పెంచుకోవాలన్నారు. వినూత్న ఆలోచనలతో గొప్పవైన నూతన ఆవిష్కరణలెన్నింటినో శాస్త్రవేత్తలు సమాజానికి అందించారన్నారు. మానవ మనుగడలో విజ్ఞాన శాస్త్రం ప్రాధాన్యత అనిర్వచనీయమైనదన్నారు. సమాజాన్ని పరిశీలిస్తూ అనేక విషయాలను ఆకలింపు చేసుకొని నూతన ఆలోచన సరళితో పరిశోధనల వైపు విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. రెండు రోజుల సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనాలు అత్యద్భుతంగా ఉన్నాయంటూ విద్యార్థులను ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల ప్రదర్శనలను జిన్నారం జెడ్పీ హై స్కూల్ విద్యార్థులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సైన్స్ ఫేర్‌కు హాజరై తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో పాటు జిన్నారం జెడ్పీ హై స్కూల్ ఉపాధ్యాయులు భూపాల్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రవీణ్, ఉపాధ్యాయ, విద్యార్థుల బృందం పాల్గొన్నారు.





నారాయణఖేడ్‌లో ముత్తూట్ ఫైనాన్స్ రెండవ బ్రాంచ్ ప్రారంభం



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

ఖేడ్‌లో ముత్తుట్ ఫైనాన్స్ రెండో బ్రాంచిని గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షేట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ హాజరైన ముత్తూట్ ఫైనాన్స్ రెండవ బ్రాంచిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముత్తూట్ ఫైనాన్స్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలిపారు. మారుమూల ప్రాంతంలో రెండు బ్రాంచ్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఫైనాన్స్ సంస్థలు పజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణాఖేడ్ పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీయస్‌వీర్ శెట్టి పాల్గొన్నారు.

గీతంలో రుక్మిణీ దేవి అరుండేల్ 120వ జయంతి

నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ (జీఎస్హెచ్ఎస్)లో గురువారం ప్రముఖ పద్మవిభూషణ్ రుక్మిణీదేవి అరుండేల్ 120వ జయంతి వేడుకలను నిర్వహించి, భరత నాట్యానికి ఆమె అందించిన అమూల్యమైన కృషికి ఘన నివాళులు అర్పించారు. తొలుత భరత నాట్య ఆచార్యురాలు అక్షయ జనార్ధనన్, తోటి అధ్యాపకులు, పలువురు విద్యార్థులతో కలిసి రుక్మిణీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలరిప్పు, తిల్లానాలతో పాటు వివిధ ఆకర్షణీయ భరతనాట్య వ్యక్తీకరణలతో కూడిన ప్రదర్శన ద్వారా ఆమె భరతనాట్య వారసత్వానికి నివాళులర్పించారు. గంటపాటు సాగిన ఈ నృత్య ప్రదర్శన సాంప్రదాయాన్ని చైతన్యంతో పెనవేసుకుని, ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో మార్మోగింది. రుక్మిణీ దేవి జీవితం, భరత నాట్యానికి ఆమె చేసిన సేవల గురించి డాక్టర్ లలిత సింధూరి వివరించారు. బీఏ-సైకాలజీ, బీటెక్ (సీఎస్ఈ-ఎఐ అండ్ ఎంఎల్) విద్యార్థులు ఉమా శ్రీనిధి, మనస్వి బోడపాటి అక్షయ అభినయంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుక్మిణీ దేవిపై డాక్యుమెంటరీని కూడా ప్రదర్శించారు.

మొక్కలు నాటి వినూత్న వీడ్కోలు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో చివరి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు తమ వీడ్కోలు దినోత్సవాన్ని ప్రాంగణంలో మొక్కలు నాటడం ద్వారా వర్సిటీతో వారి బంధాన్ని శాశ్వతం చేసుకున్నారు. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, బీబీఏ, బీకాం, ఫార్మసీ, బీఏ, ఎంఏ, బీఎస్సీ, ఎమ్మెస్సీ తదితర చివరి ఏడాది విద్యార్థులు ఒకటి చొప్పున మామిడి, జామ, అవకాడు, దానిమ్మ, నిమ్మ రావి, వేప వంటి పలు పండ్ల, నీడనిచ్చే మొక్కలను నాటి ఓ జీవితకాలం నిలిచి ఉండే ఈ మొక్కలు, గీతంలో తమ సమయాన్ని శాశ్వతమైన జ్ఞాపకంగా మలుచుకున్నారు. అటు పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు ఇటు తాము చదువుకున్న విద్యా సంస్థతో శాశ్వత సంబం ధాన్ని ఏర్పరచుకోవడం లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. ఆ మొక్కలు బొగ్గుపులుసు వాయువును తగ్గించడమే కాక, భూ కోతను నిరోధించడానికి, నేలను స్థిరీకరించి, సహజ నీటి వడపోతను పెంపొందించడంలో సహకరిస్తాయని ఆయా విద్యార్థులు చెప్పారు. గీతం స్టూడెంట్ లైఫ్ పర్యవేక్షణలో సాగిన ఈ కార్యక్రమంలో గీతం తోటపని సిబ్బంది సహకారంతో ఈ వీడ్కోలు వేడుక విజయవంతంగా ముగిసింది.





జిల్లాలో నెల రోజులు పోలీసు యాక్ట్: చెన్నూరి రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 31 వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని ఎస్పీ చెన్నూరి రూపేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముందస్తు అనుమతి లేకుండా జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రజా ధనానికి నష్టం కల్గించేలా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

చెన్నారెడ్డి నియామకం పట్ల హర్షం: వైద్యనాథ్

నవతెలంగాణ - సంగారెడ్డి

.తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా డాక్టర్ జి చిన్నారెడ్డిని నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన కృషి, రాష్ట్ర అభివృద్ధి వ్యవసాయ రంగ అభివృద్ధి ఆయనతోనే సాధ్యపడుతుందని భావించి వ్యవసాయ విద్యనభ్యసించిన డాక్టర్ జి చిన్నారెడ్డికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి ఇవ్వడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అభివృద్ధితోనే సర్వతోముఖ అభివృద్ధి సాధ్యమని భావించినట్లు అని వైద్యనాథ్ తెలిపారు. గురు వారం హైదరాబాద్ లో జి చిన్నారెడ్డిని డాక్టర్ వైద్యనాథ్, చైర్మన్ కృపాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కృపాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, చంద్రశేఖర్ రామచంద్ర రావు, మానస, వాని ఇతర వ్యవసాయ అధికారుల సంఘ సభ్యులు కలిసి సన్మానించారు.

నిజాంపేటలో నాలుగిళ్లలో చోరీ



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని భత్తుల శివవ్వ, పప్పుల కృష్ణారెడ్డి, కుమ్మరి బాలరాజ్‌ల ఇంటి తాళాలను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగుల గొట్టి చోరీకి పాల్పడ్డారని నిజాంపేట పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే బత్తుల శివవ్వ ఇంటిలో పదివేల నగదు రూపాయలు, 8 తులాల వెండి, పప్పుల కిష్టారెడ్డి ఇంటిలో తొమ్మిది వేల రూపాయలు, 9 తులాల వెండి, కుమ్మరి బాలరాజ్ ఇంటి నుంచి 2000 రూపాయలు, 10 తులాల వెండిని దొంగలు ఎత్తుకెళ్లారని బాధితులు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నిజాంపేట పోలీసులు తెలిపారు.

ఘనంగా జెడ్పీటీసీ జన్మదిన వేడుకలు



నవ తెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని జెడ్పీటీసీ క్యాంపు కార్యాలయంలో మండల జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ జన్మదిన వేడుకలను మండల బిజెపి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు చిమ్మనమైన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు ఎన్నెన్నో చేసుకోవాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాల పోచయ్య, జీపి స్వామి, శెనగపల్లి తిరుపతి, గేరిగంటి బాబు, రాజిరెడ్డి, చంద్రశేఖర్, బండారి ప్రశాంత్, గరుగుల శ్రీనివాస్, దండు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ స్థాయిని మించి మాట్లాడుతున్నారు

కాంగ్రెస్ జిల్లా నాయకులు చంద్రం కృష్ణ గౌడ్



నవతెలంగాణ- కౌడిపల్లి

సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తన స్థాయిని మించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చంద్రం కృష్ణ గౌడ్ ఆవేదన వ్యక్తం చెందారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేటీఆర్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. ఎన్నికలు అయిపోయి మూడు నెలలు కాకముందే మల్కాజిగిరి ఎంపీ పోటీకి సీఎం రేవంత్ రెడ్డిని సీఎం పదవికి కొడంగల్‌లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బరిలో దిగాలని అనడం ఇంకా పిచ్చిలో నుంచి బయటకు రాలేరన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపక్షాలు లేకుండా చేసి అసెంబ్లీని ఇష్టం వచ్చినట్టు నడిపించి రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసిపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఆయన అన్నారు. సిరిసిల్లలో పట్నం మహేందర్ రెడ్డి కష్టపడి ఆ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుంచారని, పట్నం మహేందర్ రెడ్డిని పక్కన పెట్టి కేటీఆర్ ఆ స్థానాన్ని లాక్కున్నారన్నారు. రేవంత్ రెడ్డి ప్రజలలో నుంచి వచ్చి చిన్న జడ్పిటిసి స్థాయి నుంచి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యే స్థాయి వరకు తన సొంతంగా ఎదిగారన్నారు. వారి కుటుంబంలో రాజకీయాలు చేసిన వారు ఎవరు లేరన్నారు. కేసీఆర్ కుటుంబంలో హరీష్ రావు, కేటీఆర్, సంతోష్ రావు, కవిత, కుటుంబ పాలనలాగా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అతి త్వరలో కాలేశ్వరం మెడిగడ్డలో జరిగిన అవినీతిపై కేసీఆర్ కుటుంబం జైలుకెళ్లేది ఖాయమన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణలో వచ్చిన ఆదరణ చూసి కేసీఆర్ కుటుంబం భయపడుతుందన్నారు. రానున్న రోజులలో బీఆర్ఎస్ పార్టీని ప్రజలెవరూ నమ్మరన్నారు.

చల్మెడలో సివిల్ రైట్స్ డే



నవతెలంగాణ-నిజాంపేట్

మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో గురువారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ గంగాధర్ గౌడ్, ఏఎస్ఐ జైపాల్ రెడ్డిల ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ గ్రామంలో ఏవైనా అంటరానితనం కుల వివక్ష హోటలలో రెండు గ్లాసుల పద్ధతి దేవాలయాల ప్రవేశం లో ఆటంకాలు వంటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. గ్రామంలో పౌరులకు ఏవైనా వివక్ష లాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారులకు తెలియజేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జస్టిస్ పున్నయ్య సిఫార్సుల మేరకు ప్రతి నెల చివరి రోజు ఏదో ఒక గ్రామంలో సంబంధిత ఎస్సి కాలనీలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ బాల్ రెడ్డి తాజా మాజీ సర్పంచ్ చెప్పట నరసింహారెడ్డి కార్యదర్శి నరసింహారెడ్డి హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్, తుమ్మల రమేష్ కాకి రాజయ్య కోతి రాములు, డిబిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాసిసంజీవ్, అంగన్వాడి టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ వల్లనే తెలంగాణ సస్యశ్యామలం

నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి




నవతెలంగాణ-వెల్దుర్తి

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లనే తెలంగాణ ప్రాంతం సస్యశ్యామలమైందని నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పు లింగాపూర్ గ్రామ శివారులో నుంచి హల్దీవాగుపై నిర్మించిన బ్రిడ్జి వద్ద నుంచి పారుతున్న నీటి ప్రవాహానికి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతిని ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు లేని కబోతు ప్రభుత్వమని గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కనపడటం లేదన్నారు గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులు మాత్రమే ప్రజలకు కనిపిస్తున్నాయన్నారు అప్పుడు నిర్మించిన ప్రాజెక్టుల వల్లే తెలంగాణ సస్యశ్యామలంగా మారిందన్నారు. ప్రతి రైతు రెండు పంటలు పండిస్తున్నారంటే అది బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులేనన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, ఎంపీటీసీ మోహన్ రెడ్డి, కృష్ణ గౌడ్, పడిగ నరసింహులు, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

పుస్తె మట్టెలు అందించిన విష్ణువర్ధన్ రెడ్డి

మండలంలో తారా అంజిరెడ్డి ట్రస్టు ద్వారా ఎంతో మందికి మేలు



నవతెలంగాణ-చిలిపిచేడ్

చిలిపిచేడ్ మండలంలో తారా అంజిరెడ్డి ట్రస్టు నిరుపేదలకు అండగా నిలుస్తుందని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో అంజిరెడ్డి ట్రస్టు ద్వారా కాంగ్రెస్ సీనియర్ నాయకులు తారా విష్ణువర్ధన్ రెడ్డి సేవలు అందిస్తున్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ నిరుపేద కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు పుస్తె మట్టెలు అందించారు. తార అంజిరెడ్డి ట్రస్ట్ ఛైర్మన్ తార విష్ణు వర్ధన్ ఆధ్వర్యంలో చిలిపిచేడ్ గ్రామానికి చెందిన కొన్యాల శ్రీనివాస్ మేన కోడలు శిరీష వివాహానికి మండల అధ్యక్షుడు ఎస్ నారాయణ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు పడేపు పండరి, గ్రామ అధ్యక్షులు నర్సిములు, మాజీ సర్పంచ్ ఆంధ్రయ్య, గౌండ్ల శ్రీనివాస్ గౌడ్, జూలా దుర్గయ్య , కుమ్మరి గోపాల్, గొట్టం అర్జున్ గౌండ్ల కిష్టాగౌడ్, కొన్యాల అశోక్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు

లోక్ అదాలత్ మార్చి 16కు వాయిదా

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఉత్తర్వుల ప్రకారం మార్చి 9వ తేదీన నిర్వహించనున్న లోక్ అదాలత్ మార్చి 16కి వాయిదా వేయడం జరిగినదని జిల్లా న్యాయ సేవాధికార చైర్మన్ జిల్లా న్యాయమూర్తి కె.ప్రభాకరరావు తెలిపారు. ఈ మార్పును ప్రజలు గమనించాలన్నారు.

విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం







నవతెలంగాణ-రామాయంపేట

రామాయంపేట ప్రెస్ అధ్యక్షుడు అధ్యక్షులు బసన్నపల్లి మల్లేశం కుమార్తె వైష్ణవి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్ మల్లారెడ్డి హాస్పిటల్ సహకారంతో గురువారం రామాయంపేట పట్టణంలోని దుర్గమ్మ బస్తి, దుర్గమ్మ గుడి వద్ద ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని రామాయంపేట ఎస్సై రంజిత్ ప్రారంభించారు. బిపి, షుగర్‌తో పాటు ఇతర జబ్బులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రంజిత్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన బసన్నపల్లి మల్లేశంను, మల్లారెడ్డి హాస్పిటల్ వైద్య బృందాన్ని ఆయన అభినందించారు. ఆపరేషన్లు అవసరమైన వారికి హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని హాస్పిటల్ ప్రతినిధి మహమూద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ రమ్య, సిబ్బంది నాగప్ప, సారిక, రేఖ, పార్వతి, ఎస్సై లింగారెడ్డి, స్థానిక కౌన్సిలర్ దేవుని జయరాజు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యులు డి.జి శ్రీనివాసశర్మ ప్రముఖ సంఘ సేవకులు గట్టు ప్రశాంత్, కొడపర్తి నిరంజన్, పల్లె రాజు, జలగడుగుల నరేష్, దేవుని యాదేశ్, పోచమ్మల ప్రశాంత్ (పండు), చల్మెడ శ్రీకాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.15 లక్షలు ఇవ్వాలి

సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు



నవతెలంగాణ-చిలిపిచేడ్

మిషన్ భగీరథ లైన్ మెన్ గా పనిచేస్తున్న అజ్జమరి గ్రామానికి చెందిన పోచయ్య బుదవారం ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకుని చనిపోయారని వారి కుటుంబాన్ని %దీక్షజ% సంస్థ అధుకొని ఎక్రేషియా 15లక్షలు ఇవ్వాలని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. గురువారం పోచయ్య భౌతిక దేహనికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 7 సంవత్సరాలుగా మిషన్ భగీరథ లైన్ మెన్ గా పనిచేస్తున్న పోచయ్య కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకోవడం అతని భార్య, పిల్లలు దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత లేక, వచ్చే జీతం సరిపోక దయనీయ జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి మిషన్ భగీరథ కార్మికుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధతో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పరుషరం రెడ్డి, మిషన్ భగీరథ మేనేజర్ జగపతి బాబు, నర్సింలు, స్వామి, నవీన్, రాజు, అశోక్, బాలు, సంతోష్, శివాలల్, మల్లేష్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బాధితున్ని ఆదుకోవాలని జెడ్పీటీసీ విజ్ఞప్తి



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని మల్లన్న గుట్ట అటవీ ప్రాంతంలో వల్లూరు గ్రామానికి చెందిన బత్తుల సాయిలు సోమవారం తన అరవై మేకలను మేతకు తీసుకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు నురుగు కక్కు కుంటూ 46 మేకలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న నార్సింగి జెడ్పీటీసీ బాణాపురం కృష్ణా రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబులు మేకల కాపరి సాయిలు కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబానికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ మేకలకు పోస్టుమార్టం నిర్వహించిన మండల పశువైద్య అధికారి జీవన్ ప్రతాప్‌తో, పంచనామా నిర్వహించిన చేగుంట తహసీల్దార్ సుల్తానా బేగంలతో మాట్లాడామన్నారు. జీవన్ ప్రతాప్ మేకలు విషపు మొక్కలు తినడం వల్లనే మరణించాయని నివేదికను తహసీల్దార్ సుల్తానా బేగంకు అందజేశారని తెలిపారు. సుల్తానా బేగంతో ఈ విషయమై మాట్లాడుతూ బత్తుల సాయిలు నిరుపేద అని, మేకల మరణం వల్ల అతనికి ఆరు లక్షల వరకు నష్టం జరిగిందన్నారు. మేకలే ఆతని కుటుంబానికి జీవన ఆధారమని, పేదరికం వల్ల మేకలకు బీమా కూడా చేయించలేక పోయాడన్నారు. మేకల మృతి వల్ల అతని కుటుంబం రోడ్డున పడి పూట గడవడం కూడా కష్టంగా మారిందని వివరించామన్నారు. మానవతా దృక్పదంతో నష్ట పరిహారం అందేలా చూడాలని, నివేదికను జిల్లా కలెక్టర్‌కు త్వరగా పంపి బాధితున్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. దీనిపై సుల్తానా బేగం సానుకూలంగా స్పందిస్తూ నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించడం జరిగిందని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి అన్ని విధాలా తన తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

శివలింగ నంది విగ్రహ స్థిర ప్రతిష్ట మహోత్సవం



నవతెలంగాణ -వెల్దుర్తి

మండల పరిధిలో నెల్లూరు గ్రామపంచాయతీ పెద్దాపూర్ గ్రామ శివారులో గురువారం శ్రీ పంచముఖి హనుమాన్ సహిత శివలింగ నంది విగ్రహ స్థిర ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. దండమని మత్తలో శ్రీ బాలా త్రిపుర సుందరి ఆలయ ప్రాంగణంలో ఆలయ పూజారి భానూరి నిర్మల భానూరి సిద్ధిరాములు గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నరసపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆలయ నిర్వాహకులు శాలువులతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడారు పూజలు చేయడం మానవులకు శ్రేష్టమన్నారు. పూజలు చేయడం వల్ల ఏ తప్పులు చేయకుండా నిగ్రహణ శక్తి కలిగి ఉంటారన్నారు పూజలు చేయడం వలన ఇతరులకు అపకారం చేయడానికి మనసు ఒప్పుకోదన్నారు ఆలయాల్లో నిత్య దూప దీప నైవేద్యం కొనసాగించడం వలన దేవతల కటాక్షం ఎల్లవేళలా ఉంటుందన్నారు. రాజిరెడ్డి వెంట జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి నరసింహారెడ్డి తలారి మల్లేష్‌తోపాటు పూజారులు ఉన్నారు.

ఎన్నికల నియమావళిపై విద్యార్థులకు అవగాహన

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై విద్యార్థులకు అవగాహన



నవ తెలంగాణ-చేగుంట

చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఎన్నికల నియమావళిపై విద్యార్థులకు ఉపాధ్యాయులు గురువారం అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను తయారు చేసి, అది ఏ విధంగా పనిచేస్తుందో విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రఘుపతి, చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ముఖ్యమైనవని, అవి పారదర్శకంగా నిర్వహించినప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి భవిష్యత్తులో ఓటును నిజాయితీగా వినియోగించుకున్నప్పుడే మంచి నాయకుడు ఎన్నికవుతారని వారన్నారు. అలాగే ఇప్పుడున్న ప్రస్తుత తరుణంలో మన తల్లిదండ్రులు, మన కుటుంబ సభ్యులు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. చదువుతున్న ప్రతి విద్యార్థి కుటుంబ సభ్యులకు ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో కుటుంబ సభ్యులకు తెలియజేసి, రాబోయే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమ, రాథోడ్, వెంకటేష్, భవాని, శారద, శ్రీవాణి, లలిత, చక్రధర్ శర్మ, శృతి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.30 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు

కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

నవతెలంగాణ-వెల్దుర్తి

రూ.1.30 లక్షల నిధులతో పలు గ్రామాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని కుడి చెరువు పరిసరాల ప్రాంతంలో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసే సీసీ రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా ఎన్నికల హామీల్లో భాగంగా రెండు పథకాలు మహాలక్ష్మి రూ.500లకే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకం శ్రీకారం చుట్టిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సోనియా గాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు అనంతరం కుకునూరు గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు ధర్మారం దామరంచ అందుగులపల్లి మానేపల్లి గ్రామాల్లో సిసి రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా గ్రామ గ్రామాన పలు అభివృద్ధి పనులను చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేష్ రెడ్డి నరసింహారెడ్డి తలారి మల్లేష్ వెంకట్ రెడ్డి తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



యువతి అదృశ్యం



నవతెలంగాణ-నిజాంపేట

చల్మెడ గ్రామానికి చెందిన సాకలి నరసింహులు చిన్న కూతురైన సుమలత (19) రామాయంపేట పట్టణంలోని చత్రపతి శివాజీ డిగ్రీ కాలేజ్ నందు డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. బుధవారం రోజున ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదని నరసింహులు తెలిపారు. తన బంధువు కరుణాకర్ మీద అనుమానం ఉందని సుమలత తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పుస్తె మట్టెలు అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నగరం గ్రామానికి చెందిన లాలు, రాజి దంపతుల కూతురు సోనీ వివాహానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పుస్తె మట్టెలను మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ యూత్ లీడర్ దేవేందర్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాతులోత్ బాబు, రవి, కే సురేష్, నస్కల్ వార్డ్ మెంబర్ లక్ష్మా గౌడ్, పాతులోతు కిషన్ పాతులోతు రవి, గుగులోతు నాజం తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



నవ తెలంగాణ-సిద్దిపేట

మెగా డీఎస్సీ 11 వేల ఉద్యోగాలకు తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సందర్భంగా ఎన్ ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు అజ్మత్ ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. సిద్దిపేట జిల్లా గ్రంధాలయం వద్ద నిరుద్యోగులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో మైనార్టీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ ఛైర్మన్ కలిమొద్దీన్, మాజీ రాష్ట్ర కో ఆర్డినేటర్ మెరుగు రాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాషాద్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు వహబ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ముస్తక్ మున్నా, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి వంశీ, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సాధుల పవన్, పట్టణ అధ్యక్షుడు సాయి ప్రతాప్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాశీ లింగేశ్వర స్థిర ప్రతిష్టాపన



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న కాశీ లింగేశ్వర స్వామి స్థిర ప్రతిష్టాపన మహోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. గురువారం ప్రత్యేక పూజలతో కాశీ లింగేశ్వర స్వామి యంత్ర ప్రతిష్ఠించి వైభవంగా శివలింగా ప్రతిష్టాపన గావించారు. గ్రామస్తులు స్థిర ప్రతిష్టాపనలో పాల్గొని పూజలు చేశారు.

ప్రత్యేక పూజల్లో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

కాశీ లింగేశ్వర స్వామి స్థిర ప్రతిష్టాపన మహోత్సవాల్లో మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎంపీ, ఎమ్మెల్యేను శాలువా కప్పి సన్మానించారు.

బ్రహ్మోత్సవాలకు పది వేల నగదు అందజేత



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రం లోని సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమానికి నంగునూరు చెందిన డాక్టర్ మంగు ఫణి రాజ్ రూ. 10 వేల నగదును చైర్మన్ కోల రమేష్ గౌడ్‌కు పంపించారు. ప్రతి యేటా ఎదో రూపకంగా దేవాలయంకు విరాళంగా అందజేస్తున్నారని ముదిరాజ్ సంఘం నాయకులు అప్పీసు నర్సింలు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్, సభ్యులు, గ్రామస్తులు మూకుమ్మడిగా డాక్టర్ మంగు ఫణి రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి కూతురు వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే చింతా

నవతెలంగాణ-సంగారెడ్డి : హైదరబాద్ జూబ్లీహిల్స్ జేఆర్‌సి కన్వెన్షన్‌లో గురువారం జరిగిన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కూతురు త్రిష, మణికంఠ వివాహ వేడుకల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుకు ఆహ్వాన పత్రిక అందజేత

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలం ఖాత గ్రామంలో త్రిపుర సుందరి సహిత మహాదేవ స్వామి కళ్యాణ మహోత్సవానికి హాజరు కావాలని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుకు ఆహ్వాన పత్రికను గురువారం ఆయన నివాసంలో అందించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 8న శుక్రవారం రాత్రి పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం జరుగుతుందని దేవాలయం కమిటీ చైర్మన్ కాచం సూర్య ప్రకాష్, గ్రామ సర్పంచ్ చల్ల దశమంత రెడ్డిలు తెలిపారు. ఈ నెల 5 నుంచి 9 వరకు మహాదేవుని స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. సిద్దిపేట జిల్లాలోని తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నవ వధువుకు పుస్తె మట్టెలు అందజేత

నవతెలంగాణ-మర్కుక్



సమాజ సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మ్యాలక కనకయ్య ముదిరాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన మర్కుక్ గ్రామానికి చెందిన కీ.శే.అన్నల్ దాస్ మమత-సురేష్ కూతురు పూజ వివాహానికి పుస్తె మట్టెలను ఆయన మర్కుక్ తాజా మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్‌తో కలసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని, మనం సంపాదించిన దానిలో కొంత సామాజిక కార్యక్రమాలకు వెచ్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మొర్సు శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్ ముదిరాజ్, సతీష్ గౌడ్, ప్రవీణ్, భాస్కర్, క్రాంతి, ప్రవీణ్ తదితరులున్నారు.

ఘనంగా బెక్కల్ రామలింగేశ్వర స్వామి కళ్యాణం

బ్రహ్మోత్సవాలకు హాజరుకాని ఎమ్మెల్యే
పాలకవర్గం లేకుండానే కళ్యాణాన్ని నిర్వహించిన ప్రభుత్వం

నవతెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి, బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో రామలింగేశ్వర స్వామి కళ్యాణాన్ని పండితులు ఘనంగా నిర్వహించారు. కళ్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కళ్యాణాన్ని తిలకించారు. ఇదిలాఉండగా బెక్కల్ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ముందే ఆలయ కమిటీని ప్రకటించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భక్తులు మండిపడుతున్నారు. కాకతీయులనాటి రామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు పాలకవర్గం లేకుండా తొలిసారిగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం పట్ల భక్తులు ఆవేదన చెందుతున్నారు.ఆలయ అధికారులు భక్తులకు వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని భక్తులు ఆరోపించారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఇప్పటివరకు బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించలేదని ఆలయ అభివృద్ధిని పట్టించుకోవడంలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు రామలింగేశ్వర స్వామి కళ్యాణానికి సైతం ఎమ్మెల్యే రాకపోవడం ఇదే ప్రథమమని భక్తులు చర్చించుకుంటున్నారు

వెంకటేశ్వర్ రావును పరామర్శించిన రాజనర్సు

నవ తెలంగాణ-సిద్దిపేట



ఇటీవల గుండె చికిత్స జరిగి, ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పూజల వెంకటేశ్వర్ రావు (చిన్నా)ను గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు నాయకం లక్ష్మణ్, ఎడ్ల అరవింద్ రెడ్డి, ధర్మవరం బ్రహ్మం, సద్ది నాగరాజు రెడ్డి, వంగ తిరుమల్ రెడ్డి, కళ్యకుంట మల్లికార్జున్, సతన్న తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో వినతి

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిద్దిపేట అసిస్టెంట్ లేబర్ కార్యాలయంలో సిబ్బంది ఎస్. శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అందే అశోక్‌లు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు, సంపన్న వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతుందని ఆరోపించారు. కార్మిక వర్గం పక్షాన ప్రధాని మోడీ లేడని కేవలం కార్పొరేట్ల పక్షాన ఉన్నాడన్నారు. కార్మిక చట్టాలను కార్పొరేట్ అధిపతులకు అనుకూలంగా మార్చి కార్మిక హక్కులను కాల రాస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం భవన నిర్మాణ రంగంలో 60 సంవత్సరాలు పైబడిన ప్రతి నిర్మాణ కార్మికులకు నెలకు రూ. 6వేల పెన్షన్ ఇవ్వాలని, కేంద్రస్థాయి కార్మిక సంఘాల ప్రతినిధులకు రాష్ట్రస్థాయి సలహా బోర్డులో సభ్యుడిగా నియమించాలని, పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు ఇతర బెనిఫిట్‌లను, బకాయిలను ఇవ్వాలని, పాండిచ్చేరి ప్రభుత్వం ఇస్తున్న తరహాలోనే తెలంగాణ ప్రభుత్వం దసరా కానుకగా రూ.3 వేలు అందించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదం జరిగి మరణిస్తే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, పెండ్లి, ప్రసూతి కానుకలకు లక్ష రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు వేలిముద్రల విధానాన్ని రద్దుచేసి కార్డులు సులభమైన పద్ధతిలో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేని భవన నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి భవన నిర్మాణ కార్మికులను అన్ని విధాల ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బెక్కంటి సంపత్, జిల్లా నాయకులు ఈరి భూమయ్య, వలబోజు నర్సింహా చారి, గజ్జల సురేందర్, జంగిలి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కారులు ఆర్థికంగా ఎదగాలి

మత్స్యకార ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ శ్రీనివాస్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



ప్రధానమంత్రి మత్స్య సంపద యువజన పథకంలో మత్స్యకారులు చేరి ఆర్థికంగా ఎదగాలని హుస్నాబాద్ మత్స్యకార ఉత్పత్తిదార్ల సంఘం చైర్మన్ పోన్నబోయిన శ్రీనివాస్ కోరారు. ఉమ్మడి హుస్నాబాద్ అక్కన్నపేట మండలాల మత్స్యకారులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమ్మడి మండలంలోని మత్స్యకారుల సంఘం అధ్యక్షులు కార్యదర్శులు అసంఘంలోని సభ్యులందరికీ అవగాహన కల్పించి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో చేర్పించాలని కోరారు. 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపు వయసు ఉన్న ప్రతి ఒక్క మత్స్యకారుడు ఈ సంఘంలో చేరవచ్చన్నారు. సభ్యతానికి సభ్యులు రూ.2200 చెల్లించాలన్నారు. ఉమ్మడి మండలంలో 500 మంది సభ్యులు రూ.10 లక్షలు చెల్లిస్తే, కేంద్ర ప్రభుత్వ పథకంలో రూ.20 లక్షలను కేంద్ర ప్రభుత్వం మనకు గ్రాంట్ జమ చేస్తుందన్నారు. అదేవిధంగా స్వయంగా కోటి రూపాయల వరకు చేపల ఉత్పత్తి కోసం మనం ఏర్పాటు చేసే ప్రాజెక్టు ద్వారా వినియోగించుకోవచ్చన్నారు. మార్చి పదో తేదీలోపు ఎక్కువమంది సభ్యత్వం తీసుకునేట్లు చూడాలన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-సిద్దిపేట : సిద్దిపేటలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎన్ఎస్‌యుఐ అధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కోఆర్డినేటర్ దాసరి రాజు, ఓబిసి జిల్లా అధ్యక్షులు సూర్యవర్మల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 వేల మెగా డీఎస్సీ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. నిరుద్యోగులు చాలా సంతోషపడే రోజన్నారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్క ఉద్యోగం కూడా భర్తిచేయలేదని, సీఎం రేవంత్ రెడ్డి ఏదైతే ప్రకటన చేశారో అది తప్పకుండా నెరవేరుస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులు అనేకరకాలుగా నిరసన కార్యక్రమాలు చేసిన పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 2 నెలల గడువ లేదని, 11 వేలకు పైగా మెగా డీఎస్సీ ఉద్యోగాలు రావడం గొప్ప విషయమన్నారు. ఈ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ రావడానికి ఎన్ఎస్‌య ఐ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కృషి ఉన్నదని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండల్వాడి సతీష్, నియోజకవర్గ అధ్యక్షులు బడికోల్ రాకేష్ యాదవ్, చినకొడూర్ మండల కాంగ్రెస్ నాయకులు పిట్ల అర్జున్, మొగిలి రాకేష్, తరుణ్, సాజిద్, రమేష్, వెంకట్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఇంకెన్నాళ్లు..?

- అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు
- కనీస సౌకర్యాల్లేక సిబ్బంది ఇబ్బందులు
- 9 గ్రామాల్లో అద్దె భవనాల్లో అంగన్వాడీల నిర్వహణ
- బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలో ఆనవాళ్లులేని అంగన్వాడీ కేంద్రం

నవతెలంగాణ-బెజ్జంకి

స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) ద్వారా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు ఏటా ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా.. అద్దె భవనాలు, ఇరుకు గదుల్లోనే ఉపాధ్యాయులు, చిన్నారులు, లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల మండలంలో సుమారు 9 గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నూతన గ్రామ పంచాయతీలు అభివృద్ధికి చిహ్నాలని గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు గంభీరంగా చెప్పిన సందర్భాలున్నాయి. నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటైన బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం నేటికి ఏర్పాటు చేయకపోవడం గత ప్రభుత్వం అంగన్వాడీలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే విమర్శలు వెల్లవెత్తుతున్నాయి. రాష్ట్రంలో నూతనంగా పాలనాధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మిస్తే చిన్నారులకు విద్యతో పాటు పౌష్టికాహారం అందుతుందని పలువురు ప్రజలు కోరుతున్నారు.

అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు

చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాలను పట్టించుకునే వారు కరువయ్యారు. కేంద్రాల్లో చేర్పించిన 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు విద్యతో పాటు పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తోంది. మండలంలో మొత్తం 23 గ్రామాల్లో 33 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా అందులో 12 కేంద్రాలకు మాత్రమే స్వంత భవనాలు ఉన్నాయి. 11 కేంద్రాలు అద్దె భవనాల్లో, మరో 10 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాల భవనంలో కొనసాగుతున్నాయి. బెజ్జంకి మండల కేంద్రంలో (2), రేగులపల్లి, పోతారం, గుగ్గిల్ల, వడ్లూర్, నర్సింహుల పల్లి, కల్లేపల్లి(2), బేగంపేట, దాచారం గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలో నేటికీ అంగన్వాడీ కేంద్రం ఆనవాళ్లు కనిపించకపోవడంతో నర్సింహులపల్లి గ్రామ అంగన్వాడీ ఉపాధ్యాయురాలు నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు పట్టించుకొని అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వేతనం నుంచి అద్దె చెల్లింపు..!

అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలకు ప్రతి నెలా వెయ్యి రూపాయల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. కనీస సౌకర్యాల్లేని అద్దె ఇళ్లలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి అద్దె గదిలోనే సామగ్రిని భద్రపర్చడం, ఒకపూట వండిపెట్టడం, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించడం వంటి పనులన్నీ ఒకేచోటే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఇరుకు గదులతో చిన్నారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు, సౌకర్యాలు లేని ఇరుకైన అద్దె గదుల్లోని కేంద్రాలకు వెళ్లేందుకు నిరాసక్తత చూపుతున్నారు. దీంతో అంగన్వాడీ కేంద్రాల్లో హాజరుశాతం పడిపోతుందనే వాదన వినిపిస్తోంది. మండల కేంద్రంలో ఒక అంగన్వాడీ ఉపాధ్యాయురాలు తనకు ప్రభుత్వం ద్వారా వచ్చే వేతనం నుంచి కొంత వెచ్చించి అద్దె చెల్లిస్తున్నట్టు సమాచారం.



మోక్షమెప్పుడో మరి

అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవన నిర్మాణాలకు ఎప్పుడు మోక్షం కలుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు నూతన భవనాలను నిర్మించడంపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టి సారించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ఇద్దరికి బదులుగా ఒక్కరే

మండలంలోని అయా గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణకు ఇద్దరు సూపర్‌వైజర్లు విధులు నిర్వర్తించాల్సి ఉంది. ఇద్దరికి బదులుగా ఒక్కరే సూపర్ వైజర్ విధులు నిర్వర్తించడంతో అంగన్వాడీ కేంద్రాల్లో తిష్ఠ వేసిన సమస్యలను పరిష్కరించడం జఠిలంగా మారుతోంది.

సొంత భవనాల కోసం అర్జిస్తున్నాం

జయమ్మ, ఐసీడీఎస్ సీపీడీఓ

మండలంలోని అయా గ్రామాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వాలను అర్జిస్తూనే ఉన్నాం. సానుకూల స్పందించడం లేదు. భవనాలకు అద్దెను ఎవరు భరించడం లేదు. పూర్తిగా ప్రభుత్వమే చెల్లింపులు చేస్తోంది. హుస్నాబాద్ డివిజన్ పరిధిలో 9 క్లస్టర్లుండగా 6 మంది సూపర్ వైజర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకరు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఐదుగురు సూపర్ వైజర్లు మండలానికి ఒక్కరూ చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు.

కాళేశ్వరం ఫలితాలను బయటకు చాటుతాం

కేసీఆర్ చొరవతో..స్వ రాష్ట్రంలో అభివృద్ధి
పొద్దు తిరుగుడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-తొగుట



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి, సంక్షేమం జరిగిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తొగుటలో వ్యవసాయ మార్కెట్‌లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొద్దు తిరుగుడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ఆకుపచ్చ తెలంగాణ కోసం ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణకు గుండెకాయలాంటి ప్రాజెక్టు మీద కాంగ్రెస్ నాయకులు అవినీతి ఆరోపణలు చేయడం హేయ నీయమన్నారు. నేడు యాసంగి పంట పొలాలు ఎండిపోతున్నాయని, రాజకీయాలు పక్కన పెట్టి సాగునీళ్ల అందించి రైతులను ఆదుకునే ప్రయత్నం చేయాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో వాస్తవాలను ప్రజలకు వివరించడానికే మెడిగడ్డ పర్యటన చేస్తామన్నారు. దేశానికి పట్టుకొమ్మలు పల్లె సీమలని ఆనాడు మహాత్మా గాంధీ చెప్పిన నినాదాన్ని నేడు కేసీఆర్ నిజం చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నూతన పంచాయతీ రాజ్ చట్టంతో కేసీఆర్ వాటికి ప్రత్యేక నిధులు కేటాయించి వాటి బలోపేతం కోసం కృషి చేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ ద్వారా చెరువు కుంటలను అభివృద్ధి చేసిందని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాగునీటి సౌకర్యం, 24 గంటల కరెంట్, రైతు బంధు, రైతు బీమా పథకాలతో గ్రామాల్లో పచ్చని పంట పొలాలతో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడిందన్నారు. రైతులు పొద్దు తిరుగుడు ధాన్యంను తొగుట వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువచ్చి మద్దతు ధర రూ.6760 పొందాలని సూచించారు. కార్యక్ర మంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, మార్కుఫెడ్ డీఎం క్రాంతి, సొసైటీ చైర్మన్ కె. హరికృష్ణా రెడ్డి, వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, తహసీల్దార్ శ్రీకాంత్, మార్కెట్ కార్యదర్శి స్వామి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కో అప్షన్ సభ్యులు ఎండీ కలీమోద్దీన్, ఎంపీటీసీలు సుతారి లలిత రమేష్, వేల్పుల స్వామి, మండల యూత్ అధ్యక్షుడు మాదాసు అరుణ్ కుమార్, మాజీ సర్పంచ్ సిరినేని గోవర్ధన్ రెడ్డి, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, దోమల కొమురయ్య, బక్క కనకయ్య, మాజీ వైస్ చైర్మన్ కంది రాంరెడ్డి, దేవునూరి పోచ య్య, చిలువేరి మల్లారెడ్డి, ఎం చంద్రారెడ్డి, బోధనం కనకయ్య, మంగ నర్సింహులు, శ్రీనివాస్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, భిక్షపతి, అనిల్, అశోక్, వెంకట్, సుభాష్, బాలరాజు, బైరా గౌడ్, ఎల్లం, పులి రాజు, రమేష్ గౌడ్, నర్సింహులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కూతురు వివాహ వేడుకల్లో పాల్గొన్న శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

హైదరాబాద్ జెఆర్సీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ కూతురు వివాహ మహోత్సవానికి కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఆయన వెంట తుక్కాపూర్ మాజీ సర్పంచ్ విజయ్ రెడ్డి, నాయకులు ఎర్రన్నగారి శ్రీనివాస్ రెడ్డి, గాండ్ల తిరుపతి తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ పరీక్షలు

ముగ్గురు విద్యార్థుల గైర్హాజర్
చివరి నిమిషంలో విద్యార్థికి అనుమతి

నవతెలంగాణ-బెజ్జంకి



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన చేసిన పరీక్షా కేంద్రంలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైయ్యాయి. ప్రభుత్వ ఆదేశాలను పరీక్షల నిర్వహణ సిబ్బంది పకడ్బందీగా అమలు చేశారు. పరీక్షలకు హజరయ్యే ప్రతి విద్యార్థిని పరీక్షల నిర్వహణ సిబ్బంది తనిఖీలు చేపట్టి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. 161 మంది విద్యార్థులకు ముగ్గురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు పరీక్ష కేంద్రం నిర్వహణాధికారి డీఓ వెంకట క్రిష్ణ తెలిపారు. సరాసరి ఉదయం 9 గం.లకు పరీక్షా కేంద్రం అవరణలోకి ప్రవేశించిన విద్యార్థిని పరీక్ష రాసేందుకు అనుమతించారు. ఒక్క నిముషం అలస్యం నిబంధన పకడ్బందీగా అమలు చేస్తున్న దృష్ట్యా విద్యార్థులు నిర్దేశించిన సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సీఐ ధనరాజ్ సూచించారు.

నవ తెలంగాణ-కొండపాక

ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 144 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరయ్యారు. మోడల్ స్కూల్లో 98 మంది పరీక్షలు రాయాల్సిందగా 92 మంది పరీక్షలు రాసి ఆరుగురు గైర్హాజరయ్యారు.

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండవ రోజు జరిగిన ఇంటర్ పరీక్షలకు ఒకరు గైర్హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ తెలిపారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు 141మందికిగాను 140 మంది హాజరైనట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షకు గంట ముందే సెంటర్‌కు చేరుకోవాలన్నారు. హాల్ టికెట్ లేని విద్యార్థులను పరీక్షా కేంద్రానికి అనుమతించమన్నారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని తోకల కొండపై వెలసిన సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. భజన మండలిచే సంకీర్తనలు, సామూహిక కుంకుమార్చనలు, స్వామి వారికి అర్చన, సుదర్శన హవనం, పూజలు నిర్వహించారు. గురువారం స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. వేదపండితులు హాజరై కరతాల ధ్వనులతో సీతా రాముల కళ్యాణం జరిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్, సోసైటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్ స్వామివారి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల భక్తులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మైసంపల్లి గ్రామంలో గురువారం ఉదయం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ లింగం, రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ గ్రామంలో నివసిస్తున్న ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమకు తెలియజేయాలని సూచించారు. దళిత, గిరిజనుల పైన వివక్ష చూపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవాలయాలకు రానివ్వకపోవడం, హెూటళ్లలో వేర్వేరు గ్లాసులు ఏర్పాటు చేయడం లాంటి చిన్నచూపు చూడడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, ఆశావర్కర్లు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వర్గల్



పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని గౌరారం గ్రామంలో ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో పౌరహక్కులపై గ్రామ ప్రజలకు అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వార కల్పించిన పౌరహక్కుల పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యల ద్వార హక్కులను సాధించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్గల్ మండల ఎంపీడీఓ విజయలక్ష్మి, ఆర్ఐ నాగరాజు, గ్రామ పంచాయితీ సెక్రటరీ శ్రీనివాస్,కరుణాకర్ పాల్గొన్నారు.

గొడుగు స్రవంతికి శుభాకాంక్షల వెల్లువ

నవతెలంగాణ-తొగుట



గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాలలో లింగంపేటకు చెందిన గొడుగు స్రవంతి విజయం సాధించడం హర్షణీయమని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అన్నారు. మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన గొడుగు నరసిం హులు కుమార్తె గొడుగు స్రవంతి గురుకుల జూని యర్ లెక్చరర్ ఫలితాలలో విజయం సాధించారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గొడుగు నరసింహులు కుటుంబ సభ్యులందరూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం హర్షణీయమన్నారు. మొదటి అమ్మాయి జూనియర్ లెక్చరర్‌గా, రెండో అమ్మాయి పోలీస్ కానిస్టేబుల్‌గా, కుమారుడు పోలీస్ కానిస్టేబుల్‌గా ఈ మధ్య కాలంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. ఉద్యోగం సాధించాలంటే ఎంతో పోటీ తత్వం ఉన్న ఈ రోజుల్లో ఓకే ఇంట్లో మూడు ఉద్యోగాలు సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ రోజుల్లో ఒక ఉద్యోగం సాధించాలంటే కఠోర శ్రమ చేయాలని వాటిని అధిగమించి ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఎన్నో అడ్డంకులను అధిగమించి ఉన్నతమైన ఉద్యోగాన్ని గొడుగు స్రవంతి సాధించడం సంతోషం కలిగిస్తుం దన్నారు. గొడుగు స్రవంతికి మూడు ఉద్యోగాలు ఇంటర్వ్యూ వరకు వచ్చాయి. అందులో పెద్ద ఉద్యోగం ఇంటర్వ్యూలో కూడా నెగ్గి విజయం సాధించారన్నారు. తొగుట ప్రభుత్వ జూనియర్ కళాశాల, పూర్వ విద్యార్థి అయిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు శుభాకాంక్షలు, శుభాభినందనలు తెలియజేశారు. ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీపై విమర్శలు మనుకోవాలి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి

నవతెలంగాణ-తొగుట



తిమ్మాపూర్ ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీ, దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డిపై విమర్శలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, తిమ్మాపూర్ ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీ, దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డిపై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలలో స్పెషల్ డెవలప్మెంట్ నిధులతో ఒక్కో నియోజకవర్గానికి రూ. 10 కోట్ల చొప్పున మొత్తం 1190 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వాటిని జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించి ఆయా నియోజకవర్గాల్లో అవసరమైన పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. జీవో ప్రకారమే దుబ్బాక నియోజకవర్గంలోని వివిధ మండలాలకు అవసరమైన మేర జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ నిధులను మంజూరు చేశారని తెలిపారు. ప్రభుత్వం జీవోలో నిర్దేశించిన ప్రకారం పాఠశాలలు, కళాశాలలలో మౌలిక వసతులను, తాగునీటికి, ప్రభుత్వ కార్యాలయాల మరమ్మత్తులకు నిధులు కేటాయించారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయుస్తే, ప్రభుత్వం నిబంధనల ఉల్లంఘించిదనడం హాస్యాస్పదమన్నారు. ముందు ఎంపీటీసీ అవగాహన పెంచుకొని పూర్తిస్థాయిలో జీవో కాపీలను చదువుకుని మాట్లాడాలని సూచించారు. దుబ్బాక నియోజకవర్గంలో 10 సంవత్సరాల నుంచి అభివృద్ధి పనుల కోసం ఎన్నడు నిధులను అడగలేదన్నారు. ఆ నాటి ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే పార్టీ నాయకులతో అనవసరమైన కేసులు వేయించడం మానుకోవాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో కచ్చితంగా పాల్గొంటారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి అభివృద్ధి పనుల కోసం నిధులను తీసుక వచ్చి అభివృద్ధి చేయాలని హితవు పలికారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని లేనిపక్షంలో దుబ్బాక నియోజకవర్గం ప్రజల చేతిలో పరాభవం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, గంట రేణుక రవీందర్, మాజీ సర్పంచులు బుర్ర నర్సింహులు, కొంగర నరసింహులు, జిల్లా నాయకులు ఏన్నం భూపాల్ రెడ్డి, శీనాకర్ రెడ్డి, మండల సిసిఎల్ అధ్యక్షులు లింగాల కృష్ణ, ఐఎన్టియుసి నియోజక వర్గ అధ్యక్షులు బాలమల్లు, పబ్బతి మల్లారెడ్డి, కాసర్ల నర్సింలు, కొండల్ రెడ్డి, అంజిరెడ్డి, మల్లేశం, ఉప్పలయ్య, యాదయ్య, కనికి స్వామి, నరసింహా రెడ్డి, విష్ణు, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొ న్నారు.